## క్లుప్తంగా

### నేడు 'మీకోసం'

**నూజివీడు:** పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఈనెల 29న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆర్డీఓ వై.భవానీశంకరి ఆదివారం తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని ప్రజలు తమ సమస్యలపై అర్జీలను అందించినట్లయితే వాటిని పేర్కొన్న గడువులోగా పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ విజ్ఞప్తి చేశారు.

### తొమ్మిది ఇసుక ట్రాక్టర్లు సీజ్



**కనుమూరు(గంపలగూడెం):** మండలంలోని ప్రధాన నీటివనరైన కట్టెలేరులో కనుమూరు రేవు నుంచి పలువురు ఇసుక అక్రమంగా తరలిస్తున్నట్లు అందిన సమాచారం ప్రకారం ఎస్‌ఐ ఎస్.శ్రీను సిబ్బందితో కలిసి ఆదివారం ఆకస్మికంగా దాడి చేశారు. ఆసమయంలో అక్కడ ఇసుక లోడ్ చేసుకొని ఉన్న తొమ్మిది ట్రాక్టర్లను గుర్తించి అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్లను తిరువూరు సీఐ అబ్దుల్ నబీ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కట్టెలేరు నుంచి ఇసుక తరలించేందుకు అనుమతి లేదన్నారు. నిభందనలకు విరుద్ధంగా ఇసుకను ట్రాక్టర్లతో తరలిస్తే సీజ్ చేస్తామని హెచ్చరించారు. పట్టుబడిన తొమ్మిది ట్రాక్టర్లను సీజ్ చేసి వోల్టా, భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) చట్టాల ప్రకారం కేసు నమోదు చేశామన్నారు. ట్రాక్టర్ డ్రైవర్లను అరెస్ట్ చేసినట్లు సీఐ, ఎస్ఐలు వివరించారు.

### విద్యాసామగ్రి పంపిణీ



**కేతనకొండ(ఇబ్రహీంపట్నం):** కేతనకొండ సీయోను మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యాసామగ్రి ఆదివారం పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా అమెరికా దేశానికి చెందిన సిస్టర్ అలెక్స్ పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్య అలవర్చుకోవాలన్నారు. విద్యతోనే మానవ మేదస్సు వృద్ధి చెందుతుందని తెలిపారు. విద్యార్థుల చదువులపై తల్లిదండ్రులు బాధ్యత వహించాలన్నారు. దాతలను అభినందించారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ మోగులూరి సురేష్, పాస్టర్లు మోగులూరి సుశేశ్వరరావు, బ్యూలా, ప్రసాద్, విలయం, సువర్ణరాజు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

### విష జ్వరాల నుంచి రక్షించండి

**రెడ్డిగూడెం:** మండలంలో అన్ని గ్రామాల్లో విష జ్వరాల బారిన పడిన ప్రజలను రక్షించాలని సీపీఎం నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. రెడ్డిగూడెంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీఎం సీనియర్ నాయకులు మద్ది రెడ్డి మాధవరెడ్డి మాట్లాడుతూ మండలంలో ప్రతి గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థను త్వరితగతిన బాగు చేయాలని, వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి సరైన వైద్యం అందించాలన్నారు. దోమల నివారణకు ఫాగింగ్, స్ప్రే చేయాలని బ్లీచింగ్ చల్లి లార్వా దశలో ఉన్న దోమలను నివారించాలని కోరారు. దీనికోసం అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. ఈకార్యక్రమంలో సీపీఎం నాయకులు ఉయ్యూరు కృష్ణారెడ్డి, అప్పిరెడ్డి పాల్గొన్నారు.

### అన్నదానం

**తిరువూరు:** స్థానిక సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని సత్యసాయి మందిరంలో, అమ్మ ప్రేమాశ్రమంలో, దివ్యాంగుల ఆశ్రమంలో 38 మందికి అన్న ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవాసమితి కన్వీనర్ దామెర ప్రభాకరరావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

### సాగునీరు విడుదల

**చాట్రాయి:** మండలంలోని తమ్మిలేరు రిజర్వాయర్ ప్రాజెక్టు నుంచి రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి ఆదివారం కుడి కాలువ నుంచి దిగువకు సాగునీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజర్వాయర్‌లో నీరు పుష్కలంగా ఉందని సాగుకు నీటి కొరత ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

### సాగర్ కాలువ ఆక్రమణలపై ఫిర్యాదు

**తిరువూరు:** నాగార్జునసాగర్ ఎడమకాలువ తిరువూరు మేజరు, మైనరు చానల్స్‌పై ఆక్రమణల కారణంగా వర్షాకాలంలో ఇబ్బంది పడుతున్నామని తిరువూరు 9వ వార్డు వాసులు నీటిపారుదల శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. కాలువలను పూడ్చివేసి దుకాణ సముదాయాలు నిర్మిస్తూ యథేచ్ఛగా ఆక్రమణలకు పాల్పడుతున్న వారిపై చర్య తీసుకోవాలని కోరారు. వినాయకుడి గుడి ఎదురు రోడ్డులో సాగర్ కాలువపై అక్రమ పైపులు తొలగించి కాలువ బాగుచేయించాలని ఎన్ఎస్‌పీ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌కు ఫిర్యాదు చేశారు.

# అమ్మవార్లకు సారె సమర్పణ



గంపలగూడెం మండలం పెనుగొలనులో గజలక్ష్మీదేవికి సారె తెచ్చిన మహిళలు



గంపలగూడెం ముత్యాలమ్మ ఆలయంలో బోనాలు సమర్పిస్తున్న మహిళలు



ప్రత్యేక అలంకరలో గంపలగూడెంలో ముత్యాలమ్మ అమ్మవారు



గంపలగూడెం మండలం పెనుగొలనులో విశేష పూజలందుకొన్న గజలక్ష్మీదేవి

**గంపలగూడెం:** అషాఢ మాసం ఆదివారం సందర్భంగా మండలంలోని పలు ఆలయాల్లో మహిళలు అమ్మవార్లకు బోనం, సారె భక్తి శ్రద్ధలతో సమర్పించారు. పెనుగొలను శివారు శ్రీ శేషాచల శ్రీనివాస ఆలయ ప్రాంగణంలోని గజలక్ష్మీదేవికి రంగనాయక స్వామి భక్తబృందం ఆధ్వర్యంలో సారె సమర్పించారు. ఊటుకూరు, పెనుగొలనుకు చెందిన పలువురు మహిళలు అమ్మవారికి నూతన వస్త్రాలు, గాజులు, సారె సామగ్రితో ఆలయానికి ప్రదర్శనగా వచ్చి గజలక్ష్మీదేవికి సమర్పించారు. అర్చకులు శ్యామసుందరాచార్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**ముత్యాలమ్మకు బోనాలు..**

గంపలగూడెంలో గ్రామదేవత ముత్యాలమ్మకు బోనాల సమర్పణ వైభవంగా జరిగింది. మహిళలు పెద్దసంఖ్యలో పాలతో పొంగలి తయారు చేసి తీసుకు వచ్చి అమ్మవారికి సమర్పించారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి విశేష పూజలు నిర్వహించారు

**ముసునూరు:** గంగానమ్మ తల్లికి భక్తులు ఆషాఢ సారె సమర్పించారు. మండలంలోని కాట్రేనిపాడు యాదవ బజారులో కొలువై ఉన్న గ్రామ దేవత, ఇలవేల్పు గంగానమ్మ తల్లికి, గ్రామ ఆడపడుచులు, భక్తులు, మహిళా భక్తులు 150 మంది ఆదివారం మేళతాళాలతో చీర, సారెతో ఆలయానికి తరలివెళ్లారు. అత్యంత భక్తిశ్రద్ధలతో అమ్మవారికి సారె, పసుపు కుంకుమలు సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## హామీలు నెరవేర్చకపోతే పోరాడతాం



చారు మజుందారు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పుల్లారావు



రమణక్కపేటలో సీపీఐఎం లిబరేషన్ ఆవిర్భావ దినోత్సవం

**చాట్రాయి:** కేంద్రంలో మోదీ పాలనలో పెరుగుతున్న మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందని సీపీఐ (సీపీఐఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి దుర్గం పుల్లారావు స్పష్టం చేశారు. ఆదివారం మండలంలోని మర్రిబంధం గ్రామంలో నిర్వహించిన చారుమజుందార్ వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే చంద్రబాబు ప్రభుత్వంపై పోరాటం చేస్తామని అన్నారు. అనంతరం ముజుందార్ చిత్రపటానికి నివాళులు అర్పించారు.

**ముసునూరు:** నియంతృత్వ పోకడలతో రాజ్యమేలుతున్న కేంద్ర ప్రభుత్వాన్ని ప్రజలంతా తీవ్రంగా వ్యతిరేకించాలని సీపీఐఎం లిబరేషన్ మండల కార్యదర్శి వేముల బక్కయ్య కోరారు. ఆదివారం మండలంలోని రమణక్కపేట, చెక్కపల్లి గ్రామాల్లో ఆపార్టీ 50వ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. కిసాన్ మహాసభ అధ్యక్షుడు పామర్తి రామారావుతో కలిసి పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. నక్సల్‌బరి ఉద్యమ నిర్మాత చారు మజుందార్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. నేతలు, అభిమానులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం



రైల్వే వ్యాగన్ వర్క్‌షాపు వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న మానవ మందిరం ఆశ్రమ నిర్వాహకులు

**గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం):** ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవ కార్యక్రమం గుంటుపల్లి రైల్వే వ్యాగన్ వర్క్‌షాపులో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వ్యాగన్ వర్క్‌షాప్ డిప్యూటీ ఛీప్ మెకానికల్ మేనేజర్ రామచంద్ర మీనా, మానవ మందిరం ఆశ్రమ మహాత్మ అనుబూతి బావాజీ మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించారు. మానవ మనుగడకు మొక్కలు ఆధారం అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత చేపట్టాలని సూచించారు. మొక్కల సంరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్లాంటు ఏరియాలో 200 మొక్కలు నాటారు. లయన్స్ క్లబ్ డిప్యూటీ గవర్నర్‌లు శివ ప్రసాద్, ఆంజనేయులు, కందుల శారదా వాణీ ప్రసాద్, ఆశ్రమ నిర్వాహకులు, రైల్వే వ్యాగన్ వర్క్‌షాపు సిబ్బంది పాల్గొన్నారు.

## లింకు రోడ్డు ఇలా.. రాకపోకలు ఎలా?



అధ్వానంగా మారిన తిరువూరు-తోకపల్లి రోడ్డు

**తిరువూరు:** నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే తిరువూరు ఆర్టీసీ బస్టాండు నుంచి తోకపల్లి వెళ్లే రహదారి గోతులమయమైంది. మచిలీపట్నం-కల్లూరు రాష్ట్ర రహదారి నుంచి విజయవాడ-జగదల్‌పూర్ జాతీయ రహదారికి లింక్ రోడ్డుగా ఉన్నప్పటికీ అభివృద్ధికి నోచలేదు. భద్రాచలం, కొత్తగూడెం, మణుగూరు, పాల్వంచ, సత్తుపల్లి తదితర ప్రాంతాలకు బస్టాండు నుంచి ఆర్టీసీ బస్సులు ఈ రహదారిపైనే రాకపోకలు సాగిస్తున్నాయి. నగర పంచాయతీ పరిధిలో ఉన్న ఈ రోడ్డు అడుగడుగునా గోతులమయమై ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనచోదకులు వాపోతున్నారు. ఇటీవల సీపీఐ, ప్రజాసంఘాలు ఈ రహదారికి అత్యవసర మరమ్మతులు జరపాలని ఆందోళన చేసినా నగర పంచాయతీ అధికారులు స్పందించలేదు.



అడుగడుగునా గోతులమయమైన తోకపల్లి రహదారి

### వాహనాల తనిఖీ

**వీరులపాడు:** పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే ప్రమాద సమయాల్లో ప్రమాద తీవ్రత అధికంగా ఉంటుందని ఎస్ఐ మహాలక్ష్మణుడు పేర్కొన్నారు. వీరులపాడులో ఆదివారం వాహనాల తనిఖీ చేశారు. అధిక లోడుతో వస్తున్న ఆటోలను ఆపి డ్రైవర్లు, ప్రయాణికులకు అవగాహన కలిగించారు. ఆయన మాట్లాడుతూ ఆటోడ్రైవర్లు నిబంధనలకు అనుగుణంగా వాహనాలు నడపాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పరిమితికి మించి ప్రయాణికులతో వస్తున్న ఆటోలను గుర్తించి జరిమానా విధించారు. సిబ్బంది పాల్గొన్నారు.

### కొర్లమండలో కొనసాగుతున్న వైద్యశిబిరం

**కొర్లమండ (విస్సన్నపేట):** మండలంలోని కొర్లమండ గ్రామంలో గౌడబజారులో కొంతమంది విరేచనాలతో బాధపడుతుండటంతో గ్రామంలో ప్రభుత్వ పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన వైద్యశిబిరం రెండో రోజు కొనసాగింది. గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించినట్లు ఆదివారం వైద్యశిబిరాన్ని పరిశీలించిన డీఎంహెచ్‌ఓ సుహాసిని తెలిపారు. గ్రామంలో కొత్త కేసులు ఏమీ రాలేదన్నారు. వీరేచనాలతో బాధ పడుతున్న వారికి వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. గ్రామంలో కొన్ని రోజులు వైద్యశిబిరం కొనసాగిస్తామని డీఎంహెచ్‌ఓ అన్నారు. మండల ప్రత్యేకాధికారి, డీడీ పిషరీస్ వి.పెద్దిబాబు వైద్యశిబిరాన్ని పరిశీలించారు. ఎంపీడీఓ జి.విజయకుమారి, ఈఓపీఆర్డీ ఝాన్సీరాణి, వైద్యుడు అశ్విన్, పంచాయతీ కార్యదర్శి ఆదినారాయణ, సచివాలయ సిబ్బంది, వైద్య ఆరోగ్యసిబ్బంది, గ్రామ పెద్దలు దేవరం చక్రవర్తి పాల్గొన్నారు.

### యోగా శిక్షణ శిబిరం ప్రారంభం

**కొండపల్లి(ఇబ్రహీంపట్నం):** శాంతివన్ యోగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత యోగా శిక్షణ సదస్సు కొండపల్లి ఆర్యవైశ్య కల్యాణమండపంలో ఆదివారం ప్రారంభమైంది. ఎన్టీటీపీఎస్ ఏడీఈ ఏ.శ్రీనివాసరావు యోగా శిబిరం ప్రారంభించారు. యోగా చేయడం ద్వారా మానసిక ప్రశాంతత, శారీరక దృఢత్వం ఏర్పడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ యోగాపై మక్కువ పెంచుకుని సాధన చేయాలని సూచించారు. యోగా గురువు లంకే జనార్ధన్ మాట్లాడుతూ యోగా, ధ్యానం చేయడం ద్వారా దురాలోచన కలగకుండా సానుకూల దృక్పథం అలవడుతుందన్నారు. యోగా గురువు సాధకులతో వ్యాయామాలు, ఆసనాలు, ప్రాణాయామం, సూర్యనమస్కారాలు, ధ్యానం, చేయించారు. కార్యక్రమంలో ఇంజినీర్ సుబ్రహ్మణ్యం, స్థానికులు పాల్గొన్నారు.

### నేడు మండల పరిషత్ సమావేశం

**ఆగిరిపల్లి:** ఎంపీపీ గోళ్ల అనూష అధ్యక్షతన సోమవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మధ్యాహ్నం రెండు గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శామ్యూల్ ఆదివారం చెప్పారు. ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు సమావేశానికి హాజరుకావాలని ఆయన తెలిపారు.

### త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

**కె.తాడేపల్లి(విజయవాడరూరల్):** గురుపౌర్ణమికి ఆరాధ్యుడు శ్రీకృష్ణభగవానుడు అని త్రైత సిద్ధాంత ప్రతినిధులు ప్రచారం నిర్వహించారు. ఆదివారం కొత్తూరు తాడేపల్లి గ్రామంలో త్రైత సిద్ధాంత-ప్రబోధ సేవా సమితి ఇందూజ్ఞాన వేదిక విజయవాడ కమిటీ సభ్యులు త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం జరిగింది. ఆషాఢ మాసంలో చంద్రుడు గుండ్రంగా పెద్దగా ఉండుట వలన గురు పౌర్ణమిగా నిర్ణయించి సాక్షాత్తు శ్రీకృష్ణుడుని మాత్రమే జగద్గురువుగా భావించి, గురు పూజ చేయాలని ప్రతినిధులు తెలియజేశారు. కార్యక్రమంలో త్రైతసిద్ధాంతం- ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక విజయవాడ కమిటీ అధ్యక్షుడు, సభ్యులు జగీరపు సురేష్, సీతప్పడు, శంకర్, జయ, యశస్వి తదితరులు పాల్గొన్నారు.

### ఆర్యవైశ్య ప్రముఖుడికి మంత్రి నివాళి

**ఆగిరిపల్లి:** స్థానిక వైశ్య ప్రముఖులు మడుపల్లి నారాయణరావు శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆదివారం మంత్రి పార్థసారథి ఆయన పార్థీవదేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

### ఆలయ అభివృద్ధి కమిటీ ఎన్నిక ఏకగ్రీవం

**మెట్టగుట్ట(గంపలగూడెం):** మండలంలోని పెనుగొలను శివారు మెట్టగుట్టపై విరాజిల్లుతున్న శ్రీశేషాచల శ్రీనివాసస్వామి ఆలయ అభివృద్ధి కమిటీని ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. శనివారం రాత్రి నిర్వహించిన భక్తమండలి సమావేశంలో ఈఎన్నిక నిర్వహించారు. గౌరవాధ్యక్షుడిగా యనమద్ది విజయ్‌కుమార్, ఏడుకొండల అప్పారావు, అధ్యక్షులుగా పంది వెంకట్రావ్, ప్రధాన కార్యదర్శిగా మన్నె నరశింహమూర్తి, కోశాధికారిగా నాళ్ళ నారాయణరావు, మరో 13 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నిక చేశారు.

### సైబర్ నేరాలపై అవగాహన అవసరం

**నందిగామ టౌన్:** సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ దుర్గామహేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఆయన మాట్లాడుతూ అనుమానిత ఫోన్ కాల్స్ వస్తే వెంటనే 1930కుగానీ పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

## ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



పారిశుద్ధ్య పనులు చేయిస్తున్న సర్పంచ్ సురేష్



పుట్రేలలో బ్లీచింగ్ చల్లించే పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ స్వాతి

**ఏ.కొండూరు:** మండలంలోని కోడూరు గ్రామంలో సర్పంచ్ టి.సురేష్ ఆధ్వర్యంలో ఆదివారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఈ గ్రామంలో రహదారికి ఇరువైపులా మురుగునీరు పారే విధంగా జేసీబీతో పూడిక తీత పనులు చేయిస్తున్నారు. మురుగునీరు నిలువ ఉన్న చోట బ్లీచింగ్ పౌండర్ చల్లించారు. తాగునీటిని క్లోరినేషన్ చేయించి ప్రజలకు సరఫరా చేయిస్తున్నారు. ప్రజలు జ్వరాలు బారిన పడకుండా ప్రతిరోజు పారిశుద్ధ్య పనులు చేయించడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునే విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దోమలు వృద్ధి చెందకుండా ఫాగింగ్ చేయిస్తున్నారు.

**ఎర్రమాడు(తిరువూరురూరల్):** మండలంలోని ఎర్రమాడులో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామ పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు. సర్పంచి బొర్రా మాధవి ఆధ్వర్యంలో గ్రామంలోని పలు వార్డుల్లో మురుగు కాలువలు శుభ్రం చేయించారు. దోమల నిర్మూలనకు ఎబేట్ మందును పిచికారీ చేయడంతో పాటు రోజుల తరబడి నిల్వ ఉన్న నీటిని తొలగించారు. పంచాయతీ కార్యదర్శి రంగారావు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

**పుట్రేల(విస్సన్నపేట):** మండలంలోని పుట్రేల గ్రామంలో మారెమ్మ అమ్మవారి గుడి వద్ద, యాదవుల బజారులో అంటువ్యాధులు ప్రబలకుండా పంచాయతీ ఆధ్వర్యంలో బ్లీచింగ్ చల్లించే కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కారుమంచి స్వాతి, పంచాయతీ కార్యదర్శి మురళి పనులను పర్యవేక్షించారు. మండలంలోని తాతకుంట్ల గ్రామంలో అంటువ్యాధులు ప్రబలకుండా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో బ్లీచింగ్, డ్రెయినేజీలు మరమ్మతులు చేయించారు. సర్పంచ్ పొద్దుటూరి వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

## కోలాహలంగా ఉపాధ్యాయుల సహకార సంఘ ఎన్నిక



తిరువూరులో ఉపాధ్యాయ సహకార సంఘ ఎన్నికల సందడి

**తిరువూరు:** తిరువూరు, గంపలగూడెం, ఏకొండూరు మండలాల ఉపాధ్యాయుల పరస్పర సహకార సంఘ కార్యవర్గ ఎన్నిక ఆదివారం జరిగింది. ఐక్యోపాధ్యాయ ఫెడరేషన్, పీఆర్‌టీయూ, ఎస్టీపీ ఉపాధ్యాయ సంఘాలు మహాకూటమిగా ఏర్పడి పోటీచేయగా, డెమోక్రటిక్ పీఆర్‌టీయూ ఒంటరిగా పోటీచేసింది. మొత్తం 249 మంది సభ్యులున్న ఈ సహకార సంఘంలో తొమ్మిది మంది డైరెక్టర్లను ఎన్నుకున్నారు. మహాకూటమి తరపున మల్లెల్లి నాగేశ్వరరావు, కురిసేటి శ్రీనివాసరావు, వంగల శేషగిరిరావు, చిల్లపల్లి రమేష్, చావల రామకోటేశ్వరరావు, డీఆర్‌కేఎస్‌వీ ప్రసాద్, ఎస్ సంజీవరెడ్డి, డీపీఆర్టీయూ తరపున బంకా ప్రవీణ్, పీ వెంకటేశ్వరరావులు డైరెక్టర్లుగా గెలుపొందారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కోశాధికారి, ఇతర కార్యవర్గ సభ్యుల్ని సోమవారం ఎన్నుకోనున్నారు.

**ఎన్నికల కోలాహలం**

ఉపాధ్యాయ సహకార సంఘ ఎన్నికలకు చేసిన ఏర్పాట్లు సాధారణ ఎన్నికలను తలపించాయి. ఓటు హక్కు వినియోగించుకునే ఉపాధ్యాయులకు నిర్వాహకులు భోజనం ఏర్పాట్లు చేశారు. సంఘ కార్యాలయం వద్ద టెంట్లు వేసి ఇరు ప్యానల్స్ పోటా పోటీగా ప్రచారం చేశాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

## కేంద్ర బడ్జెట్ ప్రతుల దహనం



తిరువూరులో కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న సీఐటీయూ నాయకులు

**తిరువూరు:** కార్మికవర్గ సంక్షేమాన్ని విస్మరించి కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ తిరువూరు బోస్ సెంటర్లో ఆదివారం బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన ఆందోళనలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వరరావు, శ్రీనివాస్ మాట్లాడుతూ అంకెల గారడీతో కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో పేదలకు ఒరిగేది శూన్యమన్నారు. కీలక రంగాలకు కేటాయింపులు లేకుండా ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఎలా అమలు చేస్తారని ప్రశ్నించారు. ఏపీకి కేటాయింపుల్లో సైతం తీరని అన్యాయం చేసిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై అన్ని వర్గాలూ కలసి పోరాడాలని విజ్ఞప్తి చేశారు. సీఐటీయూ నాయకులు పిల్లి నరసింహారావు, పాత్రుడు, సుప్రజ, కమల, సోమేశ్వరరావు, సుధాకర్, దుర్గారావు, వెంకటేశ్వరరావు, రవి పాల్గొన్నారు.

## పచ్చదనంతో శోభనగిరి కళకళ



**ఆగిరిపల్లి:** ఇటీవల కురిసిన వర్షాలకు శోభనగిరి పచ్చని అందాలతో చూపరులను కనువిందు చేస్తోంది. ఎటు చూసినా పచ్చని చెట్లు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. కొండపై ఉన్న లక్ష్మీ నరసింహ స్వామిని, మల్లికార్జునస్వామిని, మెట్ల మార్గంలో దర్శించుకుని భక్తులు ప్రకృతిలో సేద తీరుతున్నారు.

## అనుమతి లేకుండా ట్యాంకర్ తీసుకెళ్లారు

- అల్లూరులో టీడీపీ నేతల లెక్కలేనితనం
- సర్పంచ్‌పై దుర్భాష

**వీరులపాడు:** మండలంలోని అల్లూరు గ్రామంలో టీడీపీ నేతలు లెక్కలేకుండా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. అనుమతి లేకుండా ట్యాంకర్ తీసుకెళ్లి సర్పంచిని దుర్భాషలాడారు. వివరాల్లోకి వెళ్తే గత పార్లమెంటు సభ్యుడు అన్ని గ్రామాల పంచాయతీలకు తన నిధుల నుంచి వాటర్ ట్యాంకులను అందజేశారు. ట్యాంకర్‌ను సర్పంచి, పంచాయతీ కార్యదర్శి అనుమతితో గ్రామస్తులు వినియోగించుకుంటున్నారు. రెండు రోజుల క్రితం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ఇంట్లో శుభకార్యం నిమిత్తం ట్యాంకర్‌ను తీసుకువెళ్లాడు. విషయం తెలుసుకున్న అధికార పార్టీ నేతలు సర్పంచి బందెలరాణి, పంచాయతీ కార్యదర్శి అనుమతి లేకుండా గ్రామంలోని టీడీపీ కార్యాలయం వద్దకు ఆ ట్యాంకర్‌ను తీసుకెళ్లారు. దీనిపై సమాచారం తెలుసుకున్న సర్పంచ్ బందెలరాణి, ఉప సర్పంచి బెల్లంకొండ నాగేశ్వరావు అక్కడికి వెళ్లి అధికార పార్టీ నాయకులను అడిగారు. నీకు ఈ ట్యాంకర్‌తో సంబంధం లేదని మేం సమాధానం చెప్పాల్సిన అవసరం లేదంటూ దూషించారని సర్పంచ్ కన్నీటి పర్యంతమయ్యారు. సర్పంచ్‌పై అధికార పార్టీ నాయకులు లెక్కలేనితనంతో వ్యవహరించడంతో ఆ గ్రామంలోని దళిత వర్గాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తనకు జరిగిన అవమానాన్ని ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు సర్పంచ్ బందెల రాణి తెలిపారు.